క్లుప్తంగా

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



పశువైద్య శిబిరం నిర్వహిస్తున్న అధికారులు

పాణ్యం: పాడి రైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గోరుకల్లు పశువైద్యాధికారి సులోచన సూచించారు. సోమవారం పిన్నాపురం గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్యాధికారులు శిబిరంలో పాడి పశువులను పరీక్షించి చికిత్స చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పాడి రైతుల వద్దకు వెళ్లి జీవాల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. సర్పంచ్ ఎల్లకృష్ణయ్య, రైతులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



గాయాలపాలైన వ్యక్తి

పాణ్యం: మండల కేంద్రంలోని పాత పెట్రోల్ బంక్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపారు. వివరాల మేరకు.. హైవే మరమ్మతుల కారణంగా వన్‌వేలో వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఈ క్రమంలోనే సోమవారం పాణ్యం చెంచుకాలనీ నుంచి హైవే దాటుతున్న ఓ వ్యక్తిని ట్రాలీ వాహనం ఢీకొట్టింది. ఆ వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో నంద్యాల జీజీహెచ్‌కు తరలించినట్లు చెప్పారు. గాయపడిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రజా ఫిర్యాదుల వేదిక పట్టని అధికారులు



కోడుమూరులో అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

కోడుమూరు రూరల్: ప్రతి సోమవారం మండల కేంద్రంలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మండల అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. సోమవారం కోడుమూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో ఎంపీడీఓ రాముడు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసులు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేష్ నాయక్ తప్ప మిగిలిన అధికారులెవ్వరూ హాజరు కాలేదు. ఉన్నతాధికారుల అజమాయిషీ లేకపోవడం వల్లే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పట్ల మండల అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల తీరుతో పరిష్కార వేదికలో ఫిర్యాదులు చేసేందుకు కూడా ప్రజలెవ్వరూ ముందుకు రావడం లేదు.

కోడింగ్‌పై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో వ్యాలీస్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం ఫ్యూచర్ కోడింగ్‌పై అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 22వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కంపెనీ ప్రతినిధి సతీష్ రామ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రతి విద్యార్థి కోడింగ్ నేర్చుకోవాలన్నారు. కోడింగ్ వల్ల ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. కోడింగ్ ప్రాముఖ్యత, ఉపయోగాలు, ఉద్యోగావకాశాల గురించి వివరించారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకెళ్లాలని సుచించారు. హెచ్‌ఓడీ డెవిడ్ కీర్తి కుమార్, సురేంద్ర బాబు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపిక




జాతీయ సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కల్లూరు: నగర శివారులోని లక్ష్మీపురం సమీపంలోని రిడ్జ్ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికై నట్లు పాఠశాల సీఈఓ గోపీనాథ్ సోమవారం తెలిపారు. పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థులు రీతు సింధు, షెర్లిన్ సంజీవ్ రీజనల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో మొదటి బహుమతి సాధించారన్నారు. ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు హర్యానా రాష్ట్రం గురుగ్రామ్‌లో జరగనున్న సీబీఎస్ఈ జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొంటారన్నారు. విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన ఉపాధ్యాయులు దెబోరా, దేవ ప్రియారాజ్‌ను, ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

నాడు బెల్టు తీసేశారు

పేదల రోజువారీ సంపాదన తాగుడుకు తగలేస్తూ ఖాళీ జేబులతో ఇంటికొస్తే కుటుంబం గడవడం సాధ్యం కాదనే విషయం తన సుదీర్ఘ పాదయాత్ర సమయంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి మాసంలోనే బెల్టు షాపులను ఏరిపారేశారు. అక్కచెల్లెమ్మల కళ్లల్లో ఆనందం చూశారు. ఈ విధానం కొనసాగిస్తే ప్రభుత్వానికి రూ.వేల కోట్లు లాభం వస్తుందని తెలిసినా సమాజంలో మార్పు కోసం మద్యం అక్రమ రవాణా, బెల్టుషాపుల నిర్వహణను ప్రోత్సహించలేదు. దీనిపై కూటమి నేతలు విషప్రచారం నిర్వహించారు. తక్కువ ఖరీదుకే నాణ్యమైన మద్యం అందిస్తామని నమ్మించారు. మద్యం ప్రియుల ఓట్లు దండుకునేలా కుట్ర చేశారు. తీరా చూస్తే ఊరూరా బెల్టు షాపులను ఏర్పాటు చేశారు. బెల్టు షాప్‌ల నియంత్రణకు చర్యలు చేపట్టాలని మహిళా సంఘాలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదు.



నేడు..

గ్రామాల్లో ఎటుచూసినా మద్యం ఏరులై పారుతోంది. వీధివీధినా బెల్టు షాపులే దర్శనమిస్తున్నాయి. వైన్ షాపుల యజమానుల అండదండలతో అధికార పార్టీ నేతలే బెల్టు షాపులను ఏర్పాటుచేసి మద్యాన్ని అడ్డగోలుగా అమ్ముతున్నారు. 'గ్రామాల్లో మద్యం గొలుసు దుకాణాలు ఏర్పాటు చేయడానికి వీల్లేదు. బెల్టు షాపులు నిర్వహిస్తే బెల్టు తీస్తా.. ఎమ్మార్పీకి మించి విక్రయించినట్లు ఎక్కడైనా తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో ఎవరి జోక్యం ఉన్నా చర్యలు తీసుకుంటాం'. అంటూ ఇటీవల అనంతపురం జిల్లాలో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు ఇచ్చినా ఆ పార్టీ నేతలే షాప్‌ల యజమానులతో కలిసి ఆదేశాలకు తూట్లు పొడుస్తున్నారు. మద్యం అమ్మకాలను అడ్డుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు.

గ్రామాల్లో బెల్ట్ దందా

- బెల్టు షాపుల వారికి టీడీపీ నేతల అండ
- రాత్రి, పగలు తేడా లేకుండా అమ్మకాలు
- మద్యం ప్రియుల నిలువు దోపిడీ
- బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నా పట్టించుకోని అధికారులు

కర్నూలు(రూరల్): మద్యం అమ్మకాలను అడ్డుకోవాల్సిన కూటమి సర్కారు మందుబాబుల జేబులకు చిల్లులు పెడుతోంది. ప్రతి పల్లెలో బెల్టు షాపులు విచ్చలవిడిగా వెలిశాయి. కుగ్రామంలోనూ పగలు, రాత్రి తేడా లేకుండా మద్యం దొరుకుతోంది. క్వార్టర్ మీద ఏకంగా రూ.30 అధికంగా వసూలు చేస్తున్నారు. అలాగే తెలంగాణ మద్యం అమ్మకాలు సైతం విచ్చలవిడిగా సాగుతున్నాయి. మండల కేంద్రాలే కాదు గ్రామాల్లోనూ ఏపీ, తెలంగాణ మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. కర్నూలు మండలానికి నాలుగు మద్యం షాపులు కేటాయించింది కూటమి సర్కార్. వెంకాయపల్లె గ్రామ సమీపాన రెండు, పంచలింగాల గ్రామంలో ఒక్కటి, సుంకేసుల డ్యాం సామీపాన మరొక వైన్ షాప్ ఏర్పాటు చేశారు. అయితే మండలంలోని 23 గ్రామ పంచాయితీలలో బెల్టు షాప్‌లు ఉండడం గమనార్హం.

గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రభుత్వమే మద్యం షాప్‌లను నిర్వహించేది. గ్రామాల్లో బెల్టుషాపులు మచ్చుకైనా కనపడేవి కావు. షాపులో ఒక వ్యక్తికి మూడు క్వార్టర్ సీసాల మద్యం మాత్రమే ఇచ్చేవారు. పరిమితికి మించి ఎవరైనా మద్యాన్ని తరలిస్తే అధికారులు దాడులు చేసి వారిపై చర్యలు చేపట్టేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం అమ్మకాలకు అడ్డే లేకుండా పోయింది. ప్రైవేటు యజమానులకు వైన్‌షాప్‌ల బాధ్యతలు అప్పగించడంతో లాభాల కోసం అడ్డగోలుగా అమ్మకాలు సాగిస్తున్నారు. షాప్‌లలో ఇష్టమొచ్చినట్లు పరిమితి లేకుండా మద్యాన్ని అమ్మేస్తున్నారు. వైన్‌షాప్‌ల యజమానుల మద్దతుతో టీడీపీ నేతలే గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్టు షాప్‌లు ఏర్పాటు చేసి అడ్డగోలుగా అమ్మకాలు సాగిస్తున్నారు. వెంకయపల్లె సమీపాన ఏర్పాటు చేసిన వైన్ షాప్‌లో అనుమతులు లేకున్నా దర్జాగా సిట్టింగ్ రూములు ఏర్పాటు చేశారు. నిత్యం వందల మంది అక్కడే కూర్చొని మద్యం సేవిస్తున్నా ఎక్సైజ్ అధికారులు గానీ, పోలీసులు గానీ కన్నెత్తి చూడటం లేదు. దీంతో సమీప వెంచర్లలో నివాసం ఉంటున్న మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తూన్నారు. మరో వైన్‌షాప్‌ను పసుపుల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం షాపింగ్ కాంపెక్స్‌లో నిర్వహిస్తున్నారు. దుకాణం పక్కన ఖాళీ ప్రదేశం ఉండటంతో నిర్వాహకులు మినీ బార్‌గా నిర్వహించుకుంటున్నారు. ఈ దుకాణానికి 500 మీటర్ల దూరంలోపే మసీద్, ఇంజినీరింగ్ కాలేజీ ఉన్నా ఎక్సైజ్ అధికారులు ఎలా అనుమతి ఇచ్చారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.



ఉల్వాలలో బెల్టు షాపులను అరికట్టాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు (ఫైల్)

నాణ్యమైన మద్యం సరసమైన ధరకు అందిస్తామన్న కూటమి నేతల హామీలు నీటిమూటలయ్యాయి. నాణ్యమైన మద్యం, ధరలు తగ్గింపు ఉత్తిదే అంటూ మద్యం ప్రియులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. మిగతా మద్యం బ్రాండ్‌ల ధరలు తగ్గించకపోవడంతో తెలంగాణ మద్యానికి డిమాండ్ పెరిగింది. మండల పరిధిలోని దేవమాడ, పూడురు, పంచలింగాల, గొందిపర్ల, ఈ.తాండ్రపాడు, పడిదెంపాడు, నిడ్జూరు గ్రామాల వారికి తెలంగాణ రాష్ట్రం పక్కనే ఉండడంతో అలా వెళ్లి ఇలా మద్యం తీసుకొస్తున్నారు.

ఉల్వాల, రేమట, ఆర్.కొంతాలపాడు, జి.సింగవరం, గార్గేయపురం, పి.రుద్రవరం, నూతనపల్లె, దిగువపాడు గ్రామాల్లో ప్రతి గ్రామంలో మూడు, నాలుగు బెల్టుషాప్‌లు ఉన్నట్లు సమాచారం. మేజర్ గ్రామ పంచాయతీ ఉల్వాలలో బెల్టు షాప్ ద్వారా రోజుకు రూ.50 వేల వ్యాపారం సాగుతున్నట్లు సమాచారం. గార్గేయపురంలో బస్టాండ్ సమీపాన ఒక పండ్ల దుకాణంలో రాత్రి, పగలు ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని గ్రామ మహిళలు మొర పెట్టుకుంటున్నారు.

బెల్టు షాపుల వారికి టీడీపీ అండ



కూటమి ప్రభుత్వంలో మద్యం బెల్టు షాప్‌లు ఎక్కువయ్యాయి. మహిళా నాయకురాలిగా ఉల్వాలలో సంక్రాంతి ముగ్గుల పోటీల విజేతను అభినందించేందుకు ముఖ్య అతిథిగా వచ్చిన నాకు గ్రామ మహిళలు గోడు వెళ్లబోసుకున్నారు. తాము కూలీనాలీ చేస్తే రోజుకు రూ.300 వస్తోందని, ఆ డబ్బును ఇంట్లోని వారు బలవంతంగా లాక్కొని మద్యం తాగి పడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారన్నారు. బెల్టు షాపుల వారికి టీడీపీ నాయకుల అండ ఉండటంతో ఎక్సైజ్, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదు.

– అలివేలమ్మ, ఐద్వా జిల్లా కార్యదర్శి, కర్నూలు

పచ్చని కుటుంబాలు నాశనమవుతున్నాయి



మద్యం మహమ్మారి వల్ల పచ్చని కుటుంబాలు నాశనం అవుతున్నాయి. గ్రామాల్లో సైతం ఎళ్ల వేళలా మద్యం దొరుకుతుండడంతో మందుబాబులు అతిగా మద్యం తాగి ఆరోగ్యం మీదికి తెచ్చుకుంటున్నారు. దీంతో వారి కుటుంబం రోడ్డున పడుతుంది. తాగుడుకు బానిస అయిన వారి భార్య, పిల్లలు దుర్భర జీవనం గడుపుతున్నారు. పిల్లల చదువులు పాడవుతున్నాయి.

– శ్యామలమ్మ, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి

ఫిర్యాదు చేసినా చర్యల్లేవు



గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. అధికార పార్టీ నేతలే బెల్టు షాప్‌లు నిర్వహిస్తున్నారు. ఉల్వాల గ్రామంలో బెల్టు షాప్‌లను అరికట్టాలని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినా ఇంతవరకు ఎక్సైజ్ అధికారులు, తాలుకా అర్బన్ పోలీసులు అరికట్టలేకపోయారు. గుడి, బడికి సమీపంలో మద్యం విక్రయిస్తుండటంతో మహిళలు, విద్యార్థినులు బయటకు రావాలంటే ఇబ్బందిగా ఉంటోంది.

– రాఘవేంద్ర, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, ఉల్వాల గ్రామం

మద్దతు ధరకు కందుల కొనుగోలు



వర్కూరులో రైతులతో మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన కందులను క్వింటాలు రూ.7550 ప్రకారం ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. సోమవారం మండలంలోని వర్కూరు రైతు సేవా కేంద్రాన్ని ఏఓ రవిప్రకాష్ తనిఖీ చేసి సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ రైతులతో మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో కంది పంట సాగు చేసి, పంట నమోదు చేయించుకున్న రైతుల నుంచి గరిష్టంగా 100 క్వింటాళ్ల వరకు కందులను కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కందులను అమ్ముకోవాలనుకునే రైతులు ఆధార్, బ్యాంకు పట్టాదారు పాసు పుస్తకాల వివరాలతో ఆయా రైతు సేవా కేంద్రాల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇప్పటివరకు 300 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, మిగతా వారు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సూచించారు.

వేలం పాటలో పెరిగిన ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న దశ్యం

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గా భోగేశ్వర క్షేత్రంలో వివిధ దుకాణాల నిర్వహణకు సోమవారం నిర్వహించిన వేలం పాటల్లో గతేడాది కంటే ఆదాయం పెరిగినట్లు ఈఓ రామానుజన్ తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా తాత్కాలికంగా కళింగర పండ్లు, చెరుకు గడలు, ఐస్, కూల్‌డ్రింక్స్ విక్రయాలకు, సప్లయర్ సామాను బాడుగకు ఇచ్చుకునేందుకు వేలంపాటలు నిర్వహించగా రూ.3,61,000 ఆదాయం వచ్చిందన్నారు. గతేడాది కంటే రూ.1,28,000 ఆదాయం పెరిగిందని చెప్పారు. పర్యవేక్షణ అధికారి వేణునాథ రెడ్డి, ప్రధాన అర్చకులు శ్యాంసుందర్ శర్మ, ఆలయ సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌పై మండల అధికారుల నిర్లక్ష్యం



సి.బెళగల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10:50 గంటలకు హాజరైన ఐదుగురు అధికారులు

సి.బెళగల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)పై మండల అధికారుల నిర్లక్ష్య ధోరణి కొనసాగుతునే ఉంది. తహసీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ సెట్ పనిచేయకపోవడంతో మండల పరిషత్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం, ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి, మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్, ఎంఈఓ జ్యోతి, ఐసీడీఎస్ కొత్తకోట సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత మాత్రమే హాజరయ్యారు. ఉదయం 10:50 గంటల తర్వాత ఎంపీడీఓ రాణెమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, హౌసింగ్ ఏఈలు గోసేనాయక్, వెంకటప్రకాష్, సుమంత్, మండల ఉపాధిహామీ ఏపీఓ రామన్న హాజరయ్యారు. ఇతర అధికారులు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో పింఛన్ మంజూరు కోసం ఒక దరఖాస్తు వచ్చినట్లు ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు.

పర్యావరణంపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎన్‌జీసీ రాష్ట్ర డైరెక్టర్ స్రవంతి

పాణ్యం: పర్యావరణం, గాలి, నీరు, భూమి, ఆహారం, శక్తి తదితర అంశాలపై విద్యార్థులకు ఎన్‌జీసీ రాష్ట్ర డైరెక్టర్ పి.స్రవంతి అవగాహన కల్పించారు. ఆమె సోమవారం పాణ్యం మండలంలోని బలపనూరు, నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా నేలను ఆరోగ్యవంతంగా ఉంచేందుకు ప్రతి విద్యార్థి కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి తన పుట్టినరోజున ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. అలాగే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులు మొక్కలను సంరక్షించాలన్నారు. త్వరలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రాజెక్టు ఆఫీసర్ సత్యనారాయణ, ప్రసాద్, ఎంఈఓ-2 సుబ్రమణ్యం, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, జిల్లా కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి, క్లస్టర్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ తనిఖీ



టిఫిన్ చేస్తున్న వారితో మాట్లాడుతున్న కమిషనర్

కర్నూలు (టౌన్): నగరంలోని అన్న క్యాంటీన్ల వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సూచించారు. సోమవారం స్థానిక కోడుమూరు జంక్షన్ సమీపంలోని పరిమళ నగర్‌లోని అన్న క్యాంటీన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అన్న క్యాంటీన్ల వద్ద ప్రతిరోజు శుభ్రత పనులు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. పరిసరాల్లో మొక్కలు పెంచాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ మూడు పూటలా పేదలకు ఆహారం అందించాలన్నారు. తప్పనిసరిగా మెనూ పాటించాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సునీల్‌బాబు సోమవారం ఓ ప్రకటలో తెలిపారు. ఈ సందర్భంగా సునీల్‌బాబు మాట్లాడుతూ.. కాల్వబుగ్గ సబ్‌స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో 11 కేవీ లైన్ నుంచి విద్యుత్ సరఫరా జరిగే గుడుంబాయి తండా గ్రామంలో ఈ నెల 28, 30 తేదీలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా మండలంలోని వివిధ గ్రామాలలో వ్యవసాయ విద్యుత్ మోటర్లకు ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా వేళల్లో రెండు రోజుల పాటు మార్పు చేసినట్లు ఏఈ ప్రకటించారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట, కొచ్చెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలైనట్లు హైవే సిబ్బంది తెలిపారు. వివరాలు.. తమ్మరాజుపల్లె గ్రామం నుంచి నంద్యాలకు వెళ్తున్న ఓ వ్యక్తి అదుపుతప్పి కిందపడడంతో గాయాలైనట్లు అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది క్షతగాత్రుడిని నంద్యాల ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి

కర్నూలు(రూరల్): స్థానిక కర్నూలు మండల పరిషత్ మీటింగ్ హాలులో సోమవారం సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ న్యాయవాది జయరాజ్ మాట్లాడుతూ.. ఆర్థిక శాఖ మార్గదర్శకాల తొలి ప్రాధాన్యత ప్రకారం ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలో కొనసాగించడమే సముచితం అన్నారు. వ్యాపారం, టెక్నాలజీ, ఆర్‌బీఐ అనుమతించిన ప్రజాభవనాలు సప్తగిరి, చైతన్య, గోదావరి, ఏపీ వికాస్ బ్యాంకుల కంటే మిన్నగా ఏపీ గ్రామీణ బ్యాంకుకే అధికంగా ఉన్నాయని చెప్పారు. రాయలసీమ లాంటి వెనుకబడిన ప్రాంతంలో రాష్ట్రస్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యలయం ఉంటే సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, మేధావులు ఏపీజీబీ ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగే విధంగా కృషి చేయాలని కోరారు. సభ్యులు నాగరాజు, ప్రసాద్ శర్మ, భాస్కర్ రెడ్డి, జంద్యాల రఘుబాబు, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యం కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జున రెడ్డి సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మల్లెపోగు సుజాత ఈనెల 21వ తేదీ నుంచి అదృశ్యమైనట్లు మామ పెద్ద నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

పాణ్యం: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. సోమవారం పాణ్యంలోని పొదుపు కార్యాలయంలో డీఆర్‌డీఏ వారి ఆదేశాల మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ×సంకల్ప్Ë కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘం మహిళలు ఏర్పాటు చేసుకున్న జీవనోపాధులను ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలనే అంశంపై వివరించినట్లు తెలిపారు. సంఘాలు ఏవైనా ఆహార ఉత్పత్తులు తయారు చేస్తే వాటిని ఎలా ప్యాకింగ్ చేయాలి, ఎలా విక్రయించాలనే అంశంపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ప్రతి మహిళ ఏదో ఒక జీవనోపాధి రంగాన్ని ఎంచుకోవాలన్నారు. తద్వారా కుటుంబానికి అండగా నిలవడమే గాకుండా ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వం అందించే రుణాలు, బ్యాంకు లింకేజీ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఏపీఎం ప్రసాద్ శ్రీనివాసరావు, అల్లాబకాష్, కామక్షామ్మ, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలి



సి.బెళగల్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ వెంకటప్రకాష్

సి.బెళగల్: మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలని మండల పీఆర్ ఏఈ వెంకటప్రకాష్ ఆదేశించారు. సోమవారం ఆయన మండలంలోని సి.బెళగల్, పోలకల్, కొత్తకోట గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను పరిశీలించి కాంట్రాక్టర్లతో మాట్లాడారు. సి.బెళగల్‌లో రూ.5 లక్షల ఉపాధిహామీ నిధులతో పాత కెనరా బ్యాంక్ వద్ద జరుగుతున్న సీసీ రోడ్డును ఆయన పరిశీలించి కొలతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. పనులు జరిగే ప్రదేశంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉండి పనులు నాణ్యతగా జరిగేలా చూడాలన్నారు. అదేవిధంగా కాంట్రాక్టర్లు నిబంధనల మేరకు పనులు చేపట్టాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు శ్రీరామ్, సుప్రియ, కాంట్రాక్టర్ శ్రీనివాసులు ఉన్నారు.

శనగలో పంటకోత ప్రయోగం



శనగలో పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామంలో రైతులు సాగు చేసిన శనగ పంటలో కోత ప్రయోగం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాధికారి పీఎల్ వరలక్ష్మి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంట కోత ప్రయోగం ద్వారా దిగుబడిని అంచనా వేయడం, పంటల ఉత్పత్తిని అంచనా వేయడం, పంటల బీమా పథకాన్ని విజయవంతంగా అమలు చేయడం జరుగుతుందన్నారు. మండలంలో రబీలో వర్షాభావ పరిస్థితుల కారణంగా శనగ పంటలో ఎకరాకు 3 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. రైతు సేవా కేంద్ర సిబ్బంది భువనేశ్వరి, ఏఈఓ భాస్కర్, ఇన్సూరెన్స్ ఏజెంట్ గిరి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

3 నుంచి కడివెళ్లలో ఓపెన్ కబడ్డీ పోటీలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల గ్రామంలో పెద్దమ్మ, మారెమ్మ, చిన్నమ్మ అవ్వల దేవర మహోత్సవాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 3 నుంచి ఓపెన్ కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు నరేంద్ర, విక్రం, శివాజీ, నాయుడు, సమర తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ.10,016, రూ. 5,016, రూ.3,016 బహుమతులు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లు వచ్చే నెల 3వ తేది లోపు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ జట్టు పేరు నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు 90591 19804, 93471 41794 నంబర్లను సంప్రదించాలన్నారు.

డీఈఓకు సన్మానం



డీఈఓ శామ్యూల్ పాల్‌ను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కల్లూరు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ విద్యాశాఖ అధికారిగా ప్రశంసలు అందుకున్న డీఈఓ శామ్యూల్‌పాల్‌ను పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణానిధిమూర్తి, జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ రవిప్రకాష్ సోమవారం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. విద్యపరంగా జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంచాలనే ఉద్దేశంతో అందరినీ సమన్వయం చేసుకుని ప్రత్యేక ప్రణాళికలతో ఉత్తమ ఫలితాల సాధన కోసం డీఈఓ కృషి చేస్తున్నారన్నారు. స్టాంటన్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాల ఒకే బిల్డింగ్‌లో నిర్వహిస్తున్నందున విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.పీఆర్‌టీయూ నాయకులు బాబురావు, సుబ్బారాయుడు, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.